## క్లుప్తంగా

### పలు వాహనాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

సంతనూతలపాడు: అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఎన్. శ్రీకాంత్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం సంతనూతలపాడులో వాహనాల తనిఖీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐ, సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపట్నం: మండలంలో మడనూరు గ్రామం పరిధిలో ఉన్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తారని విద్యుత్ ఏఈ చంద్రకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఇళ్ల సర్వీసులకు, ఆక్వా సర్వీసులుకు, అగ్రికల్చర్ సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతముక్కల, రాజుపాలెం, వజ్జిరెడ్డిపాలెం, గమళ్లపాలెం గ్రామ పరిధిలోని అగ్రికల్చర్ విద్యుత్ సర్వీసులకు కూడా విద్యుత్ సరఫరాల ఉండదని, గ్రామస్తులు గమనించాలని కోరారు.

### దివ్యాంగ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగ అభ్యర్థులకు మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు జి అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులు దృష్టిలోపం, వినికిడి లోపం, అంగ వైకల్యం, మానసిక దివ్యాంగులు, నిర్దిష్ట అభ్యాస వైకల్యం గల వారికి క్రాష్ కోర్సును ప్రత్యేక బోధన పద్ధతిలో శిక్షణను ఉచితంగా విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఎంపిక ప్రక్రియలో టెట్ పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా తీసుకుంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

### అమరవీరుడు మురళీనాయక్ నివాళులు

ఒంగోలు సిటీ: దేశ రక్షణలో సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గ, గోరంట్ల మండలం కళ్లి తాండాకు చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్‌కు నివాళులు తెలుపుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### రేపు బూచేపల్లి సుబ్బారెడ్డి వర్ధంతి

చీమకుర్తి రూరల్: దర్శి మాజీ శాసన సభ్యుడు నిత్యాన్నదాత బూచేపల్లి సుబ్బారెడ్డి 6వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం చీమకుర్తిలో నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూచేపల్లి కళ్యాణ మండపం దగ్గర విగ్రహానికి, బూచేపల్లి కమలాకర్‌రెడ్డి పార్క్‌లో బూచేపల్లి సుబ్బారెడ్డికి కుటుంబ సభ్యులు జిల్లా చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూల మాలలతో ఘననివాళులర్పిస్తారు. అనంతరం పలు సేవాకార్యక్రమాలు చేస్తారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు తెలిపారు.

### అంధులకు నైపుణ్య కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: అంధులకు నైపుణ్య కోర్సులో ఉచిత ప్రత్యేక శిక్షణను అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలోని అంధులకు వృత్తి, సామాజిక జీవితంలో అవలంబించాల్సిన నైపుణ్యాలపై మూడు నెలల పాటూ ప్రత్యేక శిక్షణ తరగతులను అంధుల జాతీయ సాధికారిక సంస్థ చెన్నై సంస్థ వారు 2025-26 సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లలో శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి, ప్రత్యేక భత్యం కూడా ఇస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అంధులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం



పరిశ్రమల అధికారులు, యజమానులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందించేలా పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం ప్రతి నెలా ఒక్కో అంశంతో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

**పరిశ్రమలకు రూ.5 కోట్ల రాయితీ మంజూరు..**

జిల్లాలోని పరిశ్రమలకు, అందుకు సంబంధించిన యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీని రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీల కుగాను 154 క్లెయిమ్స్‌కు రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం ధరఖాస్తు చేసిన వివిధ శాఖలకు చెందిన 112 అనుమతులలో 102 అనుమతులను మంజూరు చేశారు, మిగిలిన 10 అనుమతులు కుడా ఎస్ఎల్ఏ పరిధిలో ఉన్నాయి. అన్నీ శాఖల అధికారులను అనుమతులు కోసం దరఖాస్తు చేసిన వెంటనే ఎస్ఎల్ఏ సమయం వరకు ఆగకుండా మంజూరు చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.

**చిన్నారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేయాలి..**

దుర్బలమైన చిన్నారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అన్సారియా స్పష్టం చేశారు. ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి పిల్లల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. సర్వే కోసం మొబైల్, వెబ్ యాప్‌ను రూపొందించినట్లు ఆమె చెప్పారు. ఈ యాప్‌లో పొందుపరిచిన వివరాలను, దీని పనితీరును బంగారు బాల్యం నోడల్ ఆఫీసర్ గిరిధర్ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాచర్ల మండలంలో ఇప్పటికే ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, సీడీపీఓలు పాల్గొన్నారు.

**ఎంపీడీవోలకు కలెక్టర్ హెచ్చరిక..**

ఇళ్ల నిర్మాణాల విషయంలో ఎంపీడీఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. గ్రీవెన్స్ హాలులో హౌసింగ్ పథకంపై సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇది కేవలం హౌసింగ్ డిపార్ట్‌మెంట్ పని అంటూ ఎంపీడీఓలు తేలికగా తీసుకుంటే ఊరుకోనని ఆమె హెచ్చరించారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు కూడా ఈ విషయంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకొని ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి ఉండేలా పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. జూన్ 12వ తేదీన సామూహికంగా గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున జిల్లాలో లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జెడ్పీ సీఈవో, మండలాల ప్రత్యేక అధికారులు, కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

# నరాల వ్యాధికి జీజీహెచ్‌లో అరుదైన చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రమాదకర నరాల వ్యాధికి అత్యవసర శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ.. రాపర్ల గ్రామానికి చెందిన ఐజాక్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం అతడికి నరాల సమస్య మొదలైంది. కాళ్లు చేతులు నడవలేని స్థితికి చేరుకున్నాడు. చేతి వేళ్లు పట్టుకోల్పోవడం, బరువు ఎత్తలేక పోవడం లాంటి సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో వైద్య చికిత్స కోసం ఒంగోలు, గుంటూరు, విజయవాడ లాంటి అనేక నగరాలు తిరిగాడు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం వ్యాధిని కూడా నిర్ధారించలేకపోయాడు. ఆరోగ్యం కుదుటపడే మార్గం కానరాక ఐజాక్ కుటుంబం ఆందోళనకు గురైంది. ఇలాంటి పరిస్థితిలో జీజీహెచ్‌లో వైద్య చికిత్స కోసం వచ్చాడు. న్యూరాలజీ విభాగంలో వైద్యులను సంప్రదించారు. అత్యంత ఆధునిక వైద్య పరీక్షలు చేసిన న్యూరాలజీ విభాగానికి చెందిన వైద్యులు వెన్నుపూసలో సీ-3, 4 వద్ద ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారించారు. మరికొన్ని రోజులు ఇలాగే ఉంటే శ్వాస నాళాలు దెబ్బతిని ఊపిరి పీలచ్చడం కష్టమవుతుందని, ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని, వెంటనే శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఐజాక్ కుటుంబ సభ్యులకు చెప్పి ఒప్పించి ఆపరేషన్ చేశారు. జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగానికి చెందిన వైద్యుల బృందం డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ షేక్ వలిబాబు, డాక్టర్ వలిలు కొన్ని గంటల పాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతం చేశారు. ప్రసుతం ఐజాక్ పూర్తిగా కోలుకున్నాడని డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో పూర్వ స్థితికి చేరుకున్నాడని తెలిపారు. వైద్యుల బృందం కృషిని కొనియాడారు. ఒక్క పైసా ఖర్చు కాకుండా ఐజాక్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవడంతో అతడి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెంటెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# రుణాలకు మైక్రో ప్లాన్ తయారు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: మొదటి దశలో జూన్ లోపు మంజూరు చేసే రుణాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను తయారు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ టీ నారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు భాగ్య నగర్‌లోని టీటీడీ కళ్యాణ మండపంలో శుక్రవారం క్రెడిట్, లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఫార్మ్ సెక్టార్ కింద రూ.1226 కోట్లు, నాన్ ఫార్మ్‌సెక్టార్ కింద రూ.407 కోట్లు, ఇతరులకు రూ.2023 కోట్లు, సొంత అవసరాల కోసం రూ.2926 కోట్లు రుణాల అందించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వీటిని బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సిఫ్ ఇతర బ్యాంక్ పథకాల ద్వారా అందించేందుకు సీసీ నుంచి ఏపీఎం వరకూ బ్యాంక్ లాగిన్ చేయాలన్నారు. సెర్ప్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను జూన్ నెలలో 1100 యూనిట్లకు బ్యాంక్ రుణాల అందించనున్నట్లు తెలిపారు. సీసీలు సంఘం సమావేశాలను ఏర్పాటు చేసి సభ్యుల అర్హతలను బట్టి మొబైల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నమోదును జూన్ 25వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు, సంస్థాగత నిర్మాణాలు నరసింహారావు, బ్యాంక్ లింకేజీ సునీత, ఫైనాన్స్ కృపారావు, కృష్ణ కుమారి 38 మండలాలకు చెందిన ఏసీలు, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరాలు సృజనాత్మకతకు బాటలు



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

సంతనూతలపాడు: బాలబాలికల్లో ఉన్న సృజనాత్మకను వెలికి తీసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పేర్కొన్నారు. ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), జేవీవీ సంతనూతలపాడు మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్ ఉచిత వేసవి శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ వేసవి సెలవుల్లో చిన్నారులు స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు బానిసలు కాకుండా వారి చదువుల్లో ఉన్నత స్థితికి రాణించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు ఆటలు పాటలు, అనేక రకాల కళలు, సాంస్కృతిక అంశాలకు చెందిన లక్షణాలు విద్యార్థుల్లో ఉంటాయన్నారు. వాటిని వెలికి తీసి ప్రోత్సహించి ముందుకు నడిపేందుకు శిబిరాలు తోడ్పడతాయన్నారు. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థుల్లో భవిష్యత్‌లో వారు వివిధ రంగాల్లో రాణించేందుకు వీలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నిర్వాహకురాలు ఐద్వా మండల కార్యదర్శి ఎస్ మాలతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరం 10 రోజులపాటు నిర్వహిస్తామని తెలిపారు. జేవీవీ నాయకులు కే కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే మంచి ఆలోచనలు కలిగి ఉండాలని, చదువులతో పాటు సమాజంలో జరుగుతున్న మార్పులను కూడా అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే పెద్దబ్బాయి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, టైలరింగ్ టీచర్ అనూరాధ పాల్గొన్నారు.

**విద్యార్థులకు ప్రశ్నించే తత్వం అవసరం**

ఒంగోలు టౌన్: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలని..ఎప్పుడైతే ప్రశ్నించడం నేర్చు కుంటారో అప్పుడే సమగ్రాభివృద్ధి వైపు పయనిస్తారని విశ్రాంత తహశీల్దార్ షేక్ ఇస్మాయిల్ చెప్పారు. బాలోత్సవ్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్బీజీ భవనంలో జరుగుతున్న చిల్డ్రన్స్ క్యాంపులో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీడలు, సాహిత్యం చిన్నారుల్లో మానసిక వికాసంతో పాటుగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. పిల్లల్లో నిబిడీకృతమైవున్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అటు తలిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి సుబ్రమణ్యం సైన్స్ ప్రయోగాలను చేసి చూపించారు. కూల్ డ్రింక్‌లు తాగడం వలన కలిగే నష్టాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో మ్యాజిక్ రామన్, ఇంద్రజ్యోతి, వీరాస్వామి, సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణకు కార్యాచరణ రూపొందించాలి

- జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి మొదటి దశలో మిగిలిన భూ సేకరణకు కార్యాచరణ రూపొందించాలని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ అండ్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ రోణంకి గోపాల కృష్ణ ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని ఆయన చాంబర్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 15వ తేదీ లోపు భూ సేకరణకు సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ మొదటిదశలో ఇంకా పూర్తి కావాల్సిన భూమి విషయమై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, మార్కాపురం, కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఇచ్చిన గడువులోపు పూర్తిచేయాలన్నారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఒంగోలు స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), మార్కాపురం, కంభం స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు నెలాఖరుకు పూర్తి నివేదిక అందజేయాలని ఆయన ఆదేశించారు.

# ఓటర్ల జాబితాపై పార్టీ నాయకులతో సమీక్ష



పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న ఈఆర్ఓ, తహసీల్దార్‌లు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల జాబితాపై ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం సమీక్షించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్‌లు, బూత్‌లెవల్ ఏజెంట్లు, బూత్‌లెవల్ ఆఫీసర్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలపై బీఎల్‌ఓలకు సహకరించాలని పార్టీల నాయకులు బీఎల్‌ఏలకు సూచించారు. కార్యక్రమంలో చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు మండలాల తహసీల్దార్‌లు ఆర్.బ్రహ్మయ్య, వీ.ఆదిలక్ష్మి, ఎస్ఎల్ నారాయణరెడ్డి, నాగులుప్పలపాడు మండలం డీటీ వాసుదేవరావు, వైఎస్సార్ సీపీ తరఫున రూరల్ మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఇతర పార్టీల నాయకులు గొల్లపూడి సుబ్బారావు, తాతినేని రాము, దరిమడుగు రాజు, తుమ్మల సుబ్బారావు, పూనపాటి వెంకట్రావు పాల్గొన్నారు.

# వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న పురోహితులు

ఒంగోలు మెట్రో: నగరంలోని కొప్పోలు చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానంలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండో రోజు వైఖానస ఆగమ శాస్త్రంగా జరుగుతున్న కార్యక్రమంలో ఉదయం ధ్వజారోహణం, చప్పరా సేవా హోమాలు, బలిహరణ, సహస్ర నామార్చన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ సమీర్ వైభవంగా నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు శేషవాహన ఉత్సవం కనుల పండగ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాణా అధికారి, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు.

### 12న జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

ఒంగోలు: స్థానిక మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో ఈనెల 12న ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి అండర్ 23, సీనియర్ పురుషుల క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. ఎంపికైన జట్లు జూన్ నెలలో మంగళగిరి, మూలపాడు మైదానాల్లో జరిగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. క్రీడాకారుల ఎంపికకు హాజరయ్యే సమయంలో తప్పనిసరిగా వైట్ డ్రస్, షూ, సొంత కిట్, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలి. అండర్ 23 ఎంపికకు హాజరయ్యే వారు 2002 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని, పూర్తి వివరాలకు కోచ్ సుధాకర్ సెల్: 9701022333, చంద్రశేఖర్ సెల్: 9246222999లను సంప్రదించవచ్చు.

### డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: మెగా డీఎస్సీ-2025కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తున్నట్లు ఏపీబీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ ఎం.అంజల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ శిక్షణకు ఇప్పటి వరకూ దరఖాస్తులు చేయని అభ్యర్థులు ప్రస్తుతం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత, టెట్ మార్కుల జాబితా, కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ జెరాక్స్‌లు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు కార్యాలయం నం 08592-231232 లో ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

### అంధులకు నైపుణ్య కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: అంధులకు నైపుణ్య కోర్సులో ఉచిత ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలోని అంధులకు వృత్తి, సామాజిక జీవితంలో అవలంబించాల్సిన నైపుణ్యాల పై మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ తరగతులను అంధుల జాతీయ సాధికారిక సంస్థ చెన్నై సంస్థ వారు 2025-26 సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, ప్రత్యేక భత్యం కూడా ఇస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అంధులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

# బాల్య వివాహాలతో సమాజానికి అనర్థాలు



సంతనూతలపాడులో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పేర్నమిట్టలో కిషోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు: బాల్య వివాహాలతో అనర్థాలు జరుగుతాయని ఐసీడీఎస్ సిబ్బంది పేర్కొన్నారు. కిషోరి బాలికలకు కిషోరి వికాసం పథకం కింద బాల్య వివాహాలు నివారణకు సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. సంతనూతలపాడులోని గానుగపాలెం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన కిషోర్ వికాసం కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని ప్రసంగించారు. 11 నుంచి 18 సంవత్సరాల్లోపు గల కిషోరి బాలికలు ఆరోగ్య సంరక్షణ, ఆన్‌లైన్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, జీఎం ఎస్.కె అనురాధ, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, రాధా, అంజమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పేర్నమిట్టలో..**

పేర్నమిట్టలోని శాంతినగర్, కుమ్మరిపాలెం, అంగన్వాడీ కేంద్రాల్లో కిషోరి వికాసంపై బాలికలకు ఐసీడీఎస్ సూపర్వైజర్ రమా అవగాహన కల్పించారు. ఆరోగ్య సంరక్షణ, ఆన్‌లైన్ నేరాలు, బాల్య వివాహాలు నివారణ, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు షైనీ, ఏఎన్ఎం హెలినా, అంగన్వాడీ టీచర్లు నాగేంద్ర, కాంచన, సునీత, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే అప్పగించాలి

ఒంగోలు టౌన్: ప్రభుత్వం విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని ప్రయత్నించడం దారుణమని.. విద్యుత్ బస్సుల నిర్వాహణ ఆర్టీసీకే అప్పగించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అయ్యపురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం విద్యుత్ బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు తయారుచేసి అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా, లేబర్ కోడ్ రద్దును కోరుతూ ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జున రావు, డిపో అధ్యక్ష కార్యదర్శులు జి. వెంకటేశ్వర్లు, హరిబాబు, కనిగిరి డిపో అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిల్లా కమిటి సమావేశంలో మాట్లాడుతున్న అయ్యపురెడ్డి